ఆఖరి అస్త్రం

వాణిశ్రీ

శ్రీధర్ హడావుడిగా వచ్చి "రాయ్!" అన్నాడు.

రాయప్ప తలెత్తిచూసి "శ్రీధర్! ఎన్నాళ్ళకు కన్పించావురా! యెలావుంది హౌస్ సర్జనీ!" అన్నాడు నవ్వుతూ.

"నా మొఖంలా వుంది." నీరసంగా ఛైర్‌లో కూలబడ్డాడు.

"ఏం అలా అంటున్నావ్?"

"పరిస్థితులు అలా వున్నాయి." అన్నాడు శ్రీధర్.

"ఏమిటవి మీ వాళ్ళంతా స్ట్రయిక్ చేస్తున్నారా ఏం?"

"నీకెప్పుడూ స్ట్రయికులూ, ధర్నాలూను.... అది కాదు పర్సనల్ వ్యవహారం బాగాలేదు. నేనొక చిక్కులో పడ్డాను. అందులోంచి బైట పడాలి."

"కొంపతీసి యెవర్నన్నా రేప్ చేశావా యేం?" అన్నాడు రాయప్ప.

"యూ! బ్రూట్!" కోపంగా చూశాడు శ్రీధర్.

"మరింకేమిట్రా నీ చిక్కు?" నవ్వాడు రాయప్ప.

"నాగరాజు రానీ చెప్తాను." అన్నాడు.

ఇంతలో నాగరాజు తలుపు నెట్టుకుని వచ్చాడు. అతనివెంట హోటల్ సర్వర్ ట్రేలో టీ కప్పులు తీసుకుని వచ్చి టీపాయ్‌మీద పెట్టి వెళ్ళిపోయాడు.

"నువ్వు జాబ్ కోసం ట్రై చెయ్యడం మానేసి ప్రైవేట్ డిటెక్టివ్‌గా ప్రాక్టీస్ మొదలుపెట్టావటగా. నాగరాజు చెప్పాడు" అన్నాడు శ్రీధర్.

"అవును. ఏం చెయ్యను? జాబ్ దొరికేటట్లు లేదు. ఇదే నయంగా వుందిరా. నెలకొక కేస్ తగిలినా చాలు. హాయిగా వుంది. నో వర్రీస్." అన్నాడు రాయప్ప.

"మనవాడు హైదరాబాద్‌లో డిటెక్టివ్ ట్రైనింగ్ చేసి వచ్చాడు." అన్నాడు నాగరాజు.

"వెరీగుడ్." అన్నాడు శ్రీధర్.

"ఇప్పుడు చెప్పు నీ చిక్కు యేమిటో?" రాయప్ప నోట్‌బుక్ తీసి ముందు పెట్టుకొన్నాడు.

"నేను సులోచన ప్రేమించుకున్నాం."

"హూ ఈజ్ సులోచన?"

"నా జూనియర్."

"ప్రొసీడ్."

"సులోచన ఫాదర్ కోటేశ్వరావు, మోడరన్ టొబాకో ఎక్స్‌పోర్టర్స్ ప్రొప్రయిటర్."

"ఆ కంపెనీ విజయవాడ రోడ్డులో వుంది కదూ!" అన్నాడు నాగరాజు.

"యస్. సులోచన ఫాదర్ మంచివాడే. కాని మదర్ —"

"సూర్యకాంతం మార్కు."

"నో అలాగా కూడా అనిపించదు. ఆవిడ పేరు రుక్మిణీ దేవి. మొదట్లో నేనంటే లైక్ చేసేది."

"కేస్ కన్‌ఫ్యూజన్ అయిపోతోందిరా. సులోచన, నువ్వూ ప్రేమించుకొన్నాం అంటూ రుక్మిణి నన్ను లైక్ చేసేది అంటావేమిటి?" అన్నాడు నాగరాజు.

"యూ ఫూల్. నీ జోక్స్ చాల్లేరా!" అని కసురుకున్నాడు శ్రీధర్.

"వాడిని చెప్పనివ్వరా! సీరియస్‌గా విను." అని మందలించాడు రాయప్ప.

"ఇదేదో చెత్త లౌ స్టోరీలా వుందిరా!" అన్నాడు నాగరాజు.

"ఒరేయ్ మాది పవిత్ర ప్రేమరా." అని నవ్వాడు శ్రీధర్.

"అసలు సంగతి చెప్పరా!" అని విసుక్కున్నాడు రాయప్ప.

"మొదటిసారి నన్ను తన బర్త్‌డేకి ఇంటికి పిలిచింది సులోచన. ఆరోజు వాళ్ళ ఫాదర్ కన్పించలేదు. ఊళ్ళో లేడని చెప్పింది. అప్పుడే చూశాను రుక్మిణీదేవిని. సులోచన నన్ను పరిచయం చేసింది వాళ్ళ మదర్‌కి. అప్పుడొక గమ్మత్తు జరిగింది."

"ఏమిటి?"

"నన్ను చూస్తేనే ఆవిడకి ఫిట్స్ వచ్చి పడిపోయింది. అంతా కంగారుపడ్డారు. ఆవిడని బెడ్‌రూంలో పడుకోబెట్టి డాక్టర్‌కి ఫోన్ చేశారు. సులోచన ఆమెకి అప్పుడప్పుడూ అలా వస్తూవుంటుందనీ, యెక్కువ వుద్రేకం వచ్చినప్పుడు స్పృహతప్పి పడిపోతుందనీ చెప్పింది."

"తరచుగా ఫిట్స్ వస్తుంటాయా? అంతకు ముందు ఫిట్స్ వచ్చి యెంతకాలమైంది? మెంటల్ డిజార్డర్ ఏదైనా వుండేదా?" ప్రశ్నించాడు రాయప్ప.

"నేను అవన్నీ అడగలేదు." అన్నాడు శ్రీధర్.

రాయప్ప నోట్ చేసుకొన్నాడు.

"వూఁ. తర్వాత."

"తర్వాత నన్నొకరోజు డిన్నర్‌కి ఇన్వైట్ చేసింది సులోచన. రుక్మిణీదేవి నన్నుయెంతో ఆదరంగా చూసింది. సులోచన ఫాదర్ గోవిందరావు చాలా సరదా మనిషి. ఆరోజు హేపీగా గడిచింది. మా పెళ్ళికి సులోచన పేరెంట్స్ సుముఖంగా వున్నారని చెప్పింది.

"జనవరి 14 న సంక్రాంతి పండుగరోజు మా ఫాదర్ నేను వాళ్ళింటికి వెళ్ళాం. మా పాధర్‌ని చూసి రుక్మిణీ దేవికి మళ్ళీ ఫిట్స్ వచ్చాయి. విరుచుకొని పడిపోయింది. మళ్ళీ డాక్టర్ వచ్చి ట్రీట్‌మెంట్ ఇచ్చి వెళ్ళిపోయాడు. ఆ తర్వాత వారం రోజులకు సులోచన చాలా విచారంగా కనిపించింది. ప్రాక్టికల్స్‌లో పరధ్యానంగా గడిపింది. ఆమెను, పలకరిస్తే యేడుపు ముంచుకొచ్చింది. కారణం అడిగితే మన పెళ్ళికి మా మదర్ ఒప్పుకోవడం లేదు అంది సులోచన. ఎందుకో తెలియదు. స్టేటస్ విషయం చూసుకుంటే వాళ్ళకంటే మేమే పై మెట్టులో వున్నాం."

"అయితే రుక్మిణీదేవి మీ పెళ్ళికి ఒప్పుకోవడం లేదు. కారణం తెలియదు. మిమ్మల్ని సస్పెన్స్‌లో వుంచింది. మరి గోవిందరావు ఏమంటాడు?" అన్నాడు రాయప్ప.

"పాపం అతనిది ఏముంది? భోళా శంకరుడు. నేనంటే

లైక్ చేస్తున్నాడు. భార్య యెందుకు అడ్డం తిరిగిందో అతనికే అర్థంకావడంలేదు. అదే సంగతి నాతో అన్నాడు."

"నో. గోవిందరావు నీకు అబద్ధం చెప్పాడు." అన్నాడు రాయప్ప.

నివ్వెరపోయాడు శ్రీధర్.

"ఎలా అనుమానిస్తున్నావ్?"

నవ్వాడు రాయప్ప.

"సింపుల్. ఒకసారి ఒప్పుకున్న సంబంధం విషయంలో భేదాభిప్రాయం వచ్చినప్పుడు భార్య భర్తకు చెప్పకుండా ఎలా వుంటుంది? రుక్మిణీదేవికి, గోవిందరావుకిగాని, గోవిందరావు రుక్మిణీదేవికిగాని యేదో ఒక విషయంలో విభేదించివుంటారు. అయితే అదంతా ఆడవాళ్ళ వ్యవహారంగా కొట్టిపారేసి తన మగతనం నిలబెట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు గోవిందరావు. అంతేగాని అసలు సంగతి అతనికి తెలియదంటే నమ్మలేను." అన్నాడు రాయప్ప.

"ఆయన ప్రవర్తన అలాలేదు. రహస్యంగా దాచుకునే మనిషి కాదని నా వుద్దేశ్యం." అన్నాడు శ్రీధర్.

"వెల్. అలాగే అనుకుంటే మొదట్లో అంగీకరించిన సంబంధం వద్దని భార్య అంటే కారణం తెలుసుకోకుండా వంత పాడతాడా ఏ భర్తయినా! పోనీ అలాగే అనుకొంటే హి ఈజ్ యే హెన్‌పెక్‌డ్ హస్బెండ్." నవ్వాడు రాయప్ప.

"అయితే కారణమేమిటో తెలిసి దాచుకోవలసిన అవసరం యేమిటి?"

"అదే మిష్టరీ."

"వూఁ....కానివ్వు. ఇంట్రెస్టింగ్ గా వుంది కేసు." అన్నాడు నాగరాజు.

"నేను సులోచనని వదులుకోదల్చుకోలేదు" అన్నాడు శ్రీధర్.

"అయితే గొడవదేనికి? ఇద్దరూ కలిసి సీక్రెట్ గా ఏ గుళ్ళోనో పెళ్ళి చేసుకొని, ఆ తర్వాత పెద్దవాళ్ళ కాళ్ళ మీద పడిపోతే పోలా?" అన్నాడు నాగరాజు.

"ఏం కర్మం? గ్రాండ్ గా చేసుకోవలసిన పెళ్ళి దొంగతనంగా రహస్యంగా చేసుకోవలసిన అవసరం యేమిటి? మా డాడీ ఒప్పుకోరు. అసలు నాకే అలా చెయ్యడం ఇష్టంలేదు. అందర్నీ అంగీకరింపజేసి మారేజ్ చేసుకోవాలని నా ఐడియా!"

"ఆవిడ ఒప్పుకోకపోవడానికి కారణం యేమిటి?"

"రుక్మిణీదేవిని రెండుమూడుసార్లు యింటికి వెళ్ళి కలుసుకొన్నాను. మొదటిసారి వెళ్ళినప్పుడు మాట్లాడింది."

"ఏం చెప్పింది. కారణం అడిగావా?"

"ఆఁ. కుంటిసాకు చెప్పింది."

"ఏమిటది?"

"వాళ్ళ అబ్బాయి అమెరికాలో సెటిలయ్యాడు. సులోచన ఒక్కతే కూతురు. గోవిందరావు తర్వాత బిజినెస్ యెవరు చూస్తారు? అందుకే అల్లుడు ఇల్లరికం వుండి బిజినెస్ చూసుకొనే అల్లుడు కావాలట. నువ్వేం బిజినెస్ చేస్తావు? నువ్వు డాక్టర్ వి కదా! అంది. కాని నాకా కారణం సమంజసంగా కన్పించలేదు. వాళ్ళకి అటువంటి ఆలోచన మొదట్నుంచీ లేదా? వున్నప్పుడు డాక్టర్ తో పెళ్ళికి యెందుకు ఒప్పుకున్నారు? తర్వాత యెందుకు ఒప్పుకోవడంలేదు."

"ఏదో బలమైన కారణం వుందని నాకు తోస్తోంది." అన్నాడు రాయప్ప.

"ఈ స్టేజిలో వాళ్ళ ఆటలు సాగనివ్వగూడదని సులోచన, నేనూ కూడబలుక్కున్నాం."

"నేనేం చెయ్యాలో చెప్పు." అన్నాడు రాయప్ప.

"వారంరోజుల క్రితం నేను హాస్పిటల్ నుంచి వస్తుంటే యెవరో బులెట్ మీద నన్ను వెంబడించారు. తాళం తీసి రూమ్‌లోకి వెళ్ళానో లేదో హఠాత్తుగా నా మీద పడ్డారు. అయితే అతని చేతిలో కత్తి లేదు. చేతులతో గొంతుక పిసకడానికి ప్రయత్నించాడు. నేను ప్రతిఘటించి వాడిని తరిమేశాను." అన్నాడు శ్రీధర్.

రాయప్ప విస్మయంతో చూశాడు.

"చివరకు రుక్మిణీదేవి నిన్ను హత్య చేయించాలని చూస్తోందన్నమాట."

"ఆవిడ అని నిర్ధారించడానికి వీల్లేదు." అన్నాడు శ్రీధర్.

"ఏం?"

"అనుమానించాల్సివస్తే జగన్‌నిగూడ అనుమానించాలి." అన్నాడు శ్రీధర్.

"వాడెవడు?" ప్రశ్నించాడు రాయప్ప.

"వాడొక రౌడీ వెధవ."

"వాడితో పేచీ పడ్డావా?"

"యస్. నా రూమ్‌వున్న వీధిలో చివర ఒక పూరిల్లు వుంది. అందులో విజయ అనే అమ్మాయి వుంది. ఫాదర్ లేడు ఆమెకు. వాళ్ళ అమ్మ ఇళ్ళల్లో పనులు చేసి కుటుంబాన్ని పోషిస్తుంది. ఆమెకు విజయ కాక చిన్న కొడుకు వున్నాడు. విజయ ఇంటర్ ప్యాసై పైపు చేర్చుకుం

టోంది. ఆమె తమ్ముడు సెవన్తు చదువుతున్నాడు."

"అబ్బ ఆ హిస్టరీ అంతా ఎందుకురా బాబూ! అసలు సంగతి చెప్పు." విసుగ్గా అన్నాడు నాగరాజు.

"అంత విసుగైతే యెలారా? డిటెక్టివ్‌కి యెంతో ఓపిక వుండాలి. వివరాలన్నీ తెలుసుకోవాలి," నవ్వాడు శ్రీధర్.

"వాడి మాటలకేం లే. నువ్వు కానివ్వు," అన్నాడు రాయప్ప.

"ఎలాగైనా చిన్న వుద్యోగం సంపాదించి గౌరవంగా బ్రతకాలని విజయ వుద్దేశ్యం. ఆ జగన్‌గాడు వాళ్ళకి యేదో దూరపు చుట్టం. విజయని పెళ్ళి చేసుకోవాలని వాడి తాపత్రయం.

విజయ తను టైప్ నేర్చుకుంటున్న ఇనిస్ట్యూట్ ప్రిన్సిపాల్‌తో లా ఎఫైర్ పెట్టుకొంది. అతను ఆమెకోసం ఇంటికి కూడా వచ్చిపోతూ వుండేవాడు. ఆ సంగతి జగన్‌గాడు కనిపెట్టి అతను ఇంట్లోవుండగా వచ్చి గొడవ చేశాడు. విజయ వ్యభిచారం చేస్తున్నదనీ, వాళ్ళతో వీళ్ళతో చూశాననీ ప్రేలుతున్నాడు. అతను వీడితో ఘర్షణ పడుతున్నాడు.

నేను అప్పుడే రూమ్‌కి వస్తున్నాను. జగన్‌గాడు తొందరపడి అతన్ని డొక్కల్లో గుద్ది కింద పడేశాడు. విజయ యేడుస్తున్నది. కాని యెవరూ జోక్యం కలిగించుకోకపోవడం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది.

అతను పాపం అర్భకుడు. ఇటువంటి గొడవల్లో ఇరుక్కున్నవాడు కాదనుకొంటాను. తను విజయ ప్రేమించుకొంటున్నామనీ, పెళ్లి చేసుకోబోతున్నామనీ, చెప్తున్నాడు. కాని జగన్‌గాడు అతన్ని డామినేట్ చేసి

పెద్దగా అరుస్తున్నాడు.

వాడి వ్యవహారం చూసి నాకు వళ్ళు మండిపోయింది. ఏమైతే అది అయిందని వెళ్లి జోక్యం కలిగించుకొన్నాను. అసలు నువ్వెవడివి. నీకేం సంబంధం? అని పాయింట్ లేవదీశాను. వాళ్ళిష్టం ప్రేమించుకున్నారు, పెళ్లి చేసుకొంటారు అన్నాను. వాడు అదంతా నిజం కాదన్నాడు. విజయ వ్యభిచారం చేస్తున్నదని గట్టిగా చెప్పాడు. అయినా సరే అది ఆమె యిష్టం కాదనడానికి నువ్వు యెవడివి అని అడ్డంగా వాదించాను. వాడు యేం చెయ్యాలో తోచక అసలు మధ్యలో నీకేం సంబంధం అని యెదురుతిరిగాడు.

ఘర్షణ పెరిగిపోయింది. నామీద చెయ్యి చేసుకొన్నాడు. అంతే. వాడిని పచ్చడి చేసేశాను. నా ధైర్యానికి అందరూ మెచ్చుకొన్నారు. కాని వాడు మాత్రం పోతూ పోతూ నా అంతం చూస్తానని ప్రతిజ్ఞ చేసి పోయాడు." అన్నాడు శ్రీధర్.

రాయప్ప ఆలోచిస్తూ కూర్చున్నాడు.

"అయితే నిన్ను చంపడానికి ప్రయత్నించేవాడిని కనుక్కోవాలి అంతేనా?" అన్నాడు నాగరాజు.

"ఆ రోజే వాడిని పట్టుకొంటే తెలిసిపోయేది. కాని వాడు తప్పించుకొని పారిపోయాడు." అన్నాడు శ్రీధర్.

"ఎక్కడికిపోతాడు? దొరక్కుండా పోతాడా?" అన్నాడు నాగరాజు.

"అంతేకాదు. రుక్మిణీదేవి మా పెళ్ళికి యెందుకు ఒప్పుకోవడంలేదు? అనేది తెలుసుకోవాలి." అన్నాడు శ్రీధర్.

"ఓ. కె. ముందు ఒక పని చెయ్యి." అన్నాడు

రాయప్ప.

ఏమిటన్నట్లు చూశాడు శ్రీధర్.

"సాయంకాలం నాలుగ్గంటలకు రా. ఇద్దరం కలసి ఎస్. ఐ. చంద్రం దగ్గరికి వెళ్దాం."

"ఎందుకు?"

"రిపోర్టు ఇవ్వడానికి."

"ఎవరిమీద?"

"గోవిందరావు మీద."

"ఎందుకూ?"

"చెప్తానుగదా! నన్ను చంపించడానికి ట్రై చేస్తున్నాడు. కారణం ఇది అని ఇన్‌ఫ్లుయెన్స్ రిపోర్టు ఇద్దాం. అది తీసికెళ్ళి గోవిందరావుకి చూపిస్తాడు. సులోచన ఇంట్లో యేం జరిగిందీ విని మనకి చెప్పాలి. దట్సాల్." అన్నాడు రాయప్ప.

"ఓ. కె. బై ఫోర్ ఐ విల్ మీట్ యూ!" అన్నాడు శ్రీధర్ వెళ్ళిపోవడానికి లేస్తూ.

2

"అయ్యగారు పిలుస్తున్నారు" అన్నాడు నౌకరు.

ఎస్. ఐ. వెంకటేశ్వర్లు, రాయప్ప లోనికి వెళ్ళారు.

"ప్లీజ్ బీ సీటెడ్." అన్నాడు గోవిందరావు.

రాయప్ప అతన్ని పరిశీలనగా చూశాడు.

ఎర్రగా లావుగా వున్నాడు గోవిందరావు. బట్టతల తళతళ మెరుస్తోంది. గోల్డుఫ్రేమ్ కళ్ళద్దాలు పెట్టుకొన్నాడు. బ్రౌన్ కలర్ కోటు, చారల టై. వయస్సు ఏభై వరకూ వుండొచ్చు.

ఎస్. ఐ. కి తనతో యేం పని పడిందా? అని ఆలోచిస్తున్న వాడిలా చూశాడు గోవిందరావు.

నౌకరు ట్రేలో కాఫీ కప్పులు తెచ్చి నిల్చున్నాడు.

"ప్లీజ్ టేక్ కాఫీ." అన్నాడు గోవిందరావు.

ముగ్గురూ కాఫీ సిప్ చేస్తున్నారు.

విషయం ఎలా బైట పెట్టాలా అని ఆలోచిస్తున్నాడు ఎస్. ఐ.

శ్రీధర్ రిపోర్టు ఫైలోంచి తీసి గోవిందరావుకి అందించాడు యెస్. ఐ.

అంతా చదివి ఆశ్చర్యపడినట్లు కన్పించాడు అతను.

"మీరిలా చెయ్యడం యేం బాగాలేదు." అన్నాడు ఎస్. ఐ.

"రియల్లీ ఐ వండర్ ...."

"మీకేం తెలియదని చెప్పబోతున్నారు. యామ్ ఐ కరెక్టు." అన్నాడు యెస్. ఐ.

"మీరు నమ్మకపోయినా నిజం అదే. అతన్ని హత్య చేయించాల్సిన ద్వేషం యేం లేదు నాకు."

"ద్వేషం లేకపోవచ్చు. కాని ప్రయత్నం చేస్తున్నారు గదా! అతను బ్రతికివుంటే మీ అమ్మాయి మనసు మార్చుకోదని గ్రహించి, అతని అడ్డు తొలగించుకోవడానికి చూస్తున్నారు."

"ఐయామ్ సారీ. మీరు ఆధారం లేకుండా మాట్లాడుతున్నారు." అన్నాడు గోవిందరావు, ఎస్. ఐ. ఆరోపణకు అభ్యంతరం తెలియజేస్తూ.

"ఆధారం లేదని మీరనుకొంటున్నారు. అతను మాకు రిపోర్టు చేశాడు. అతనికి యేమైనా జరిగితే బాధ్యత మీదే."

గోవిందరావు వులిక్కిపడ్డాడు.

"మీరు మమ్మల్ని అనుమానించడం సబబుగానే

వుంది. ఎందుకంటే శ్రీధర్ రిపోర్టు చేశాడు గనుక. కాని అతను ఇంత తెలివితక్కువ వాడనుకోలేదు."

"ఇష్టం లేదన్నా వెంటబడుతున్నాడనా?" ప్రశ్నించాడు రాయప్ప.

"ఇష్టం లేకపోవడానికి కారణం వుంది. బహుశ అతను మీకు చెప్పివుంటాడు. మాకు ఒక్కడే కొడుకు. అమెరికాలో స్థిరపడిపోయాడు. సులోచన ఆడపిల్ల. నా తర్వాత బిజినెస్ చూసుకోవడానికి అల్లుడు ఇల్లరికం వుండాలి. అది నా షరతు. శ్రీధర్ డాక్టర్. అతన్ని బిజినెస్ చూసుకోమనడం న్యాయంగా వుండదు. అందుకని ఈ సంబంధం వద్దనుకున్నాం."

"ఆ సంగతి ముందు మీరు అనుకోలేదా? కొన్నాళ్ళు ప్రేమించుకోనిచ్చారు. పెళ్ళి చెయ్యడానికి ఒప్పుకున్నారు. ఏదో ఒక కారణంవల్ల కుదరదని అనుకొని ప్రేమికులను విడిపొమ్మంటున్నారు. మీకు యిది న్యాయంగా వుందా?" అన్నాడు రాయప్ప.

"ఎన్నో అనుకుంటుంటాం. అన్నీ జరుగుతాయా?" నవ్వాడు గోవిందరావు.

"జరగవనుకోండి. కొందరు పట్టుదలతో సాధిస్తారు. శ్రీధర్ అటువంటివాడే. మొండి వైఖరి అతనిది. మీరు ముందే అభ్యంతరం పెట్టివుంటే బాగుండేదేమో! వాళ్ళకి ఆశలు కల్పించి విడిపొమ్మని చెప్పడంవల్ల హర్ట్ అయ్యాడు. ఎవరు చెప్పినా, ఎంత మొత్తుకున్నా వినే పరిస్థితిలో లేడు. కాబట్టి మీరు సహృదయంతో ఆలోచించి మీ నిర్ణయం మార్చుకోండి. అంతేగాని చంపుతామని, బెదిరించి, భయపెట్టి లాభం లేదు," అన్నాడు రాయప్ప.

"నాకు అదే అర్థం కావడంలేదు మిస్టర్. అతనిమీద

నాకేమీ కోపం లేదు. కొన్ని కారణాలవల్ల దూరం చేసుకోవలసివచ్చింది. ఐ యామ్ సారీ ఫర్ దట్. అంతే కాని, అతన్ని బెదిరించడానికి నేనేమీ ప్రయత్నం చెయ్యలేదు," అన్నాడు గోవిందరావు.

"మీ నాలెడ్జి లేకుండా ఇంకెవరైనా అలా చెయ్యడానికి అవకాశం వుందా?" ప్రశ్నించాడు ఎస్.ఐ.

"ఇంకేవరు చేస్తారు?" యెదురుప్రశ్న వేశాడు.

"మీ మిసెస్."

"నో...." అన్నాడు గోవిందరావు.

"అంత గ్యారంటీగా యెలా చెప్పగలరు?"

"నాకు తెలుసు. ఆమె అటువంటిది కాదు."

"ఏమో మీరు తెలుసుకోండి ఫోన్ చేసి." అన్నాడు యెస్. ఐ.

గోవిందరావు ముఖం యెర్రబడింది.

"అవసరం లేదు. నాకు తెలుసు" గట్టిగా అన్నాడు.

"మీరు అనవసరంగా ఫీలవుతున్నారు. ఫోన్ చేసి అడిగితే తెలిసిపోతుంది గదా!"

"నో ఇన్స్పెక్టర్. ఐ కాంట్. బిలీవ్ మీ! షి వోంట్ డూ సచ్ రబ్బిష్ థింగ్స్," ఆవేశంతో అన్నాడు.

"అయితే మీ భార్య గురించి మీకేమీ తెలియదన్న మాట," నవ్వాడు యెస్. ఐ.

దెబ్బతిన్నవాడిలా చివ్వున తలెత్తి చూశాడు గోవింద రావు.

"నా ఐయామ్ గోయింగ్ టూ ప్రూవ్ ది థింగ్," అని రాయప్ప వైపు చూసి "ప్లీజ్" అన్నాడు యెస్.ఐ.

రాయప్ప గదిలోనుంచి బైటికి వెళ్ళి కాసేపటి

తర్వాత తిరిగి వచ్చాడు. అతని వెంట ఒక కుర్రాడు వున్నాడు.

గోవిందరావు అతనివంక యెగాదిగా చూశాడు.

ఎత్తుగా, లావుగా, ఎర్రబనీను, నీలంరంగు ప్యాంట్‌తో మీసాలు వొత్తుగా, కొంచెం గడ్డం పెరిగి, మొత్తానికి రౌడీలా వున్నాడు.

"ఎవరు నువ్వు?" ప్రశ్నించాడు గోవిందరావు.

"క. డీని," వికృతంగా నవ్వాడు అతను.

"అసలు సంగతి చెప్పు," గద్దించాడు యెస్. ఐ.

"ఒకరోజు అమ్మగారు నన్ను పిలిపించారు సార్. శ్రీధర్ అనే అతను మెడికల్ కాలేజీలో చదువుతూ వుంటాడని ఫోటో చూపించారు. అతన్ని యెలాగైనా చంపమని అన్నారు. ముందు వెయ్యి రూపాయలు ఇచ్చారు. ఎవరికీ తెలియకుండా పని పూర్తిచేస్తే ఇంకో నాలుగువేలు ఇస్తామన్నారు."

అతను చెప్తున్నదంతా వింటూనే గోవిందరావు ముఖం వెలవెలా పోయింది. కత్తివేటుకు రక్తపు చుక్క లేనట్లుగా తెల్లగా పాలిపోయాడు. అవమానంతో ముఖం వాల్చుకున్నాడు.

"సారీ ఇన్‌స్పెక్టర్. ఐయామ్ వెరీసారీ!" అన్నాడు వణుకుతున్న కంఠంతో.

"దట్సాల్ రైట్ గోవిందరావుగారూ! ఇప్పటికైనా తెలిసిందిగదా! ప్లీజ్ సీ దిస్ సార్ట్ ఆఫ్ థింగ్స్ డోంట్ రిపీట్ ఇన్ ఫ్యూచర్!" వార్నింగ్ ఇస్తున్న వాడిలా అన్నాడు.

గోవిందరావుకి నోటివెంట మాటలు రావడం లేదు. గొంతులో తడి ఆరిపోయింది.

వాళ్ళు ముగ్గురూ రూమ్‌లో నుంచి నిష్క్రమించగానే గ్లాసులోని మంచినీళ్ళు గడగడా త్రాగేశాడు.

3

రుక్మిణీదేవి భర్తను వింతగా చూసింది.

"ఏమిటి మీరనేది?"

"ఏవుంది? నన్నొక అసమర్ధుడిగా తీసిపారేసి తెలివితేటలు వుపయోగిస్తున్నావుగా?"

"నేనా? ఏం చేశాను?" ఆశ్చర్యంతో అడిగింది.

"ఎంత అమాయకంగా అడుగుతున్నావ్? ఆహాఁ...." అన్నాడు.

"ఏమిటో సూటిగా చెప్పండి?" చిరాగ్గా అంది.

"శ్రీధర్‌ని చంపమని యెవడికో డబ్బు ఇచ్చి పంపావా?" కఠినంగా వుంది అతని గొంతు.

ఉలిక్కిపడింది రుక్మిణీదేవి.

ఆమె కళ్ళల్లో భయం తొంగి చూసింది.

"నేనా?" అంటూ ఆమె కూర్చున్నదల్లా లేచి నిల్చుంది.

"ఆఁ. నువ్వే."

"నేనా! అతన్ని చంపమని మనిషిని పంపానా? నో. నో....!" గట్టిగా అంది.

"ష్! ఎందుగా అరుపులు, పెడబొబ్బలు. ఎవరైనా వింటారు."

"లేదండీ మీకెవరో లేనిపోనివి చెప్పారు. లేకపోతే నేనేమిటీ అతన్ని చంపమని యెవరికో డబ్బు యివ్వడం యేమిటి? మీరు యెలా నమ్మారు?" ఆందోళనగా అంది రుక్మిణీదేవి.

"నమ్మక యేం చెయ్యాలి? యెస్. ఐ. కి రిపోర్టు

చేశాడు శ్రీధర్. తనని యెవరో చంపడానికి ప్రయత్నిస్తున్నారని. పోలీసులు ఆ రౌడీ వెధవని పట్టుకొని నా ముందు పెట్టారు. నా ఎదుటే చెప్పాడు వాడు అమ్మగారు అతన్ని చంపమని వెయ్యి రూపాయలు ఇచ్చారనీ, పని చేసిన తర్వాత ఇంకా నాలుగువేలు ఇస్తానన్నారనీ...."

"నో....నో...." గట్టిగా అరిచి పడిపోయింది రుక్మిణీదేవి.

ఆమెకు మళ్ళీ ఫిట్స్ వచ్చాయి.

గోవిందరావుకి మత్తు వదిలిపోయినట్లయింది.

లేచి కూర్చుని డాక్టర్‌కి ఫోన్ చేశాడు.

తల్లి కేక విని పరిగెత్తుకొని వచ్చింది సులోచన. అప్పటివరకూ ఆమె ఇద్దరిమధ్యా సంభాషణ వింటూ నిల్చుంది.

డాక్టర్ వచ్చివెళ్ళిన అరగంట తర్వాత కళ్ళు తెరచి చూసింది రుక్మిణీదేవి.

అప్పటివరకూ అటూ ఇటూ పచార్లు చేస్తున్న గోవిందరావు ఆమె కళ్ళు తెరవడం చూసి గ్లాసులో మంచినీళ్ళు త్రాగించాడు.

"జ్యూస్ త్రాగుతావా?"

ఆమె వద్దన్నట్లు తల వూపింది.

"శ్రీధర్ మీద నాకు కోపం లేదండీ. అతన్ని చంపమని నేనెవర్నీ పురమాయించలేదు. మీకు తెలియకుండా అటువంటి పని చేస్తానా నేను?" ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

గోవిందరావు క్షణంసేపు జాలిగా చూశాడు ఆమె వైపు.

'కాని అతను తనకి చెప్పిందంతా అబద్ధమా?' ఆలోచనలతో బుర్ర తిరిగిపోయింది.

రుక్మిణీదేవి మన స్తత్వం అతనికి పూర్తిగా తెలుసు. తను పట్టిన కుందేటికి మూడే కాళ్ళనే రకం. అంతా తండ్రి పోలిక.

అతనికి గతమంతా జ్ఞాపకం వచ్చింది.

అహోబలరావుకి ఏకైక సంతానం రుక్మిణీదేవి. తను వాళ్ళ బిజినెస్‌లో ఎక్కౌంటెంట్‌గా చేరాడు. అహోబలరావుకి ఒక కొడుకు వున్నాడనీ అతను కాస్ట్ ఎకౌంట్స్ చదువుతూ ఒక హరిజన యువతిని పెళ్ళి చేసుకొన్నాడనీ, తర్వాత తండ్రి అతని ముఖం చూడ్డానికి ఇష్టపడలేదనీ, చనిపోయినప్పుడు గూడా తనకి కర్మ చేయవద్దని ఆదేశించడం....అదంతా గుర్తుకొచ్చింది.

గోవిందరావు అతన్ని యెప్పుడూ చూళ్ళేదు. కనీసం కొడుకు ఫోటో గూడా యింట్లో లేకుండా చేశాడు అహోబలరావు. క్రొత్తలో రుక్మిణీదేవిగూడ అన్నని సాధిస్తూనే వుండేది. కొడుకు దూరమయ్యాడనే దిగులు ఆయన్ని క్రుంగదీస్తూ వుండేది. గోవిందరావు ఎఫిషియన్సీ ఆయన్ని ఆకర్షించింది. తన తర్వాత సమర్ధవంతంగా బిజినెస్ చెయ్యగల సమర్ధుడనీ, దక్షుడనీ గ్రహించి కూతుర్నిచ్చి పెళ్ళిచేశాడు.

అహోబలరావు చనిపోయినప్పుడు గూడ కొడుకుని పిలవొద్దని చెప్పిపోయాడు. అతను ఢిల్లీలో యెక్కడో వుంటున్నాడు.

'తండ్రి పట్టుదలే కూతుర్లోనూ వుంది' అనుకొని దీర్ఘంగా నిట్టూర్చాడు గోవిందరావు.

"నన్ను నమ్మండీ ప్లీజ్!" అంటోంది రుక్మిణీదేవి.

"పోనీలే రుక్మిణీ! యేదో జరిగిపోయిందిలే!" అన్నాడు అనునయంగా.

"మన పిల్లలకు అంతా మేనమామ పోలికలే వచ్చినట్లున్నాయి కదండీ!" అంది.

మేనమామ కులాంతర వివాహం చేసుకోవడం, తన కొడుకు గూడా అదేవిధంగా అమెరికన్ అమ్మాయిని పెళ్ళి చేసుకొని ఇంటిముఖం చూడకపోగా తమనే అమెరికా వచ్చెయ్యమని లెటర్స్ రాయడం గుర్తొచ్చింది గోవిందరావుకి.

"కాని....శ్రీధర్....!" అంటూ ఆమె ముఖంలోకి చూసి ఆగిపోయాడు గోవిందరావు.

4

హోటల్ దుర్గాలో కౌంటర్‌లో వున్న ఫోన్ గణ గణ మ్రోగింది.

రిసీవర్ యెత్తి "హలో....హలో హోటల్ దుర్గా!" అన్నాడు నాగరాజు.

"ఐ వాంట్ మిష్టర్ రాయప్ప, ప్రైవేట్ డిటెక్టివ్!" సన్నగా వుంది గొంతు. ఎవరో అమ్మాయే సందేహం లేదు అనుకున్నాడు.

"హూ ఈజ్ స్పీకింగ్ ప్లీజ్!"

"సులోచన."

"జస్ట్ యె మినిట్," అని రూమ్ నెంబరు వన్‌కి కనెక్షన్ ఇచ్చాడు నాగరాజు.

వాళ్ళు సంభాషించుకోవడం పూర్తయిన తర్వాత కౌంటర్‌లో తమ్ముడిని కూర్చోబెట్టి రూమ్ నెంబర్ వన్ కి హడావుడిగా వెళ్ళాడు నాగరాజు.

"సులోచన ఫోన్ చేసింది. శ్రీధర్...."

రాయప్ప మాటలకు అడ్డువస్తూ "అంతా విన్నాను," అన్నాడు.

"ఈ విషయం శ్రీధర్‌కు తెలియనివ్వకు. జాగ్రత్త. సులోచన అందుకే నాకు డైరెక్టుగా ఫోన్ చేసింది," అన్నాడు.

"నా వాటా మాటో దూ?" ప్రశ్నించాడు నాగరాజు.

"మేము ఆడిన నాటకం రుక్మిణీదేవి, గోవిందరావులపై బాగా పని చేసింది. అసలు శ్రీధర్‌ని చంపడానికి ప్రయత్నించింది జగన్ తాలూకు మనిషేనని యెస్. ఐ. నిర్ధారించి చెప్పేశాడు. జగన్ కూడా ఈ సంగతి పోలీసుల దృష్టిలోకి పోయింది గనుకనూ, యెస్. ఐ. వార్నింగ్ ఇవ్వడంవల్లనూ మళ్ళీ శ్రీధర్ జోలికి వెళ్తాడని నే ననుకోను."

"వాడి మొఖం! ఇక జన్మలో శ్రీధర్ జోలికిపోడు," అన్నాడు నాగరాజు.

"పోతే ఈ విషయం శ్రీధర్ ఫాదర్‌నే నేరుగా కలుద్దామని ఆలోచిస్తున్నాను. ఇది యెప్పటిదో పాత సంగతి. అసలు మనిషినే ఆరా తీస్తే సరిపోతుంది. ఊహాగానం చెయ్యడానికి వీల్లేదు. అప్పటివరకూ నేను ఎక్కడ వుందీ శ్రీధర్‌కి తెలియకుండా వుంచు," అన్నాడు రాయప్ప.

"సరే! ఈ రాత్రికే వెళ్ళు," అన్నాడు నాగరాజు.

5

కాకినాడ గాంధీనగరంలో వుంది శ్రీధర్ వాళ్ళ బిల్డింగ్.

విశాలమైన ఆవరణలో రెండంతస్తుల మేడ.

ఇనుప గేటు ముందు. గూర్ఖా బీడీ కాలుస్తూ స్టూలుమీద

కూర్చున్నాడు.

డిటెక్టివ్ రాయప్ప తన విజిటింగ్ కార్డు ఇచ్చాడు.

గూర్ఖా చిన్న గేటు తీసి అతన్ని లోనికి రానిచ్చాడు.

లోపలికి వెళ్ళి సింహద్వారం వద్ద నిల్చున్న జవానుకి చెప్పి, విజిటింగ్ కార్డు యిచ్చాడు.

కాసేపటికి రమ్మని పిలుపు వచ్చింది.

విశాలమైన హాల్లో సోఫాలో కూర్చుని వున్నాడు జగపతిరావు.

"గుడ్ మాణింగ్!" అన్నాడు రాయప్ప విష్ చేస్తూ.

"గుడ్ మాణింగ్! ప్లీజ్ టేక్ యువర్ సీట్ మిష్టర్ రాయప్ప," అన్నాడు జగపతిరావు నవ్వుతూ.

"మీతో కొంచెం మాట్లాడాలి."

"నాకు తెలుసు. ఈ మధ్య సముద్రంలో కొట్టుకొచ్చిన స్త్రీ శవం గురించి ఎంక్వయిరీ చేస్తున్నారు గదూ!" అన్నాడు.

"నో సర్. నేను గుంటూరునుంచి వస్తున్నాను."

జగపతి కొంచెం ఆశ్చర్యపోయినట్లు కన్పించాడు.

"గుంటూరునుంచా?"

"అవును."

"ఏం కావాలి మీకు?"

"నేను శ్రీధర్ ఫ్రెండ్‌ని," అన్నాడు రాయప్ప.

"ఐ. సీ. మీ విజిటింగ్ కార్డు చూసి యే హత్య కేసో యెంక్వయిరీ చెయ్యడానికి వచ్చిన డిటెక్టివ్ అనుకొంటున్నాను."

"హత్యకేసు కాదుగాని. మొత్తానికి ఒక కేసు

యెంక్వయిరీ చేస్తున్నాను. మీ సహకారం కావాలి,” నవ్వాడు రాయప్ప.

“ఓ. యస్. అడగండి,” అన్నాడు జగపతి.

ఇంతలో జవాను కాఫీ తెచ్చి టీపాయ్‌మీద పెట్టాడు.

“తీసుకోండి,” అన్నాడు జగపతిరావు.

రాయప్ప కాఫీ సిప్ చేస్తున్నాడు.

“వేరీజ్ యువర్ లగేజ్?” ప్రశ్నించాడు జగపతిరావు.

“హోటల్లో రూమ్ తీసుకున్నాను సార్!”

“శ్రీధర్ ఫ్రెండ్‌వి. శ్రీధర్ ఇంటికి వస్తూ హోటల్లో రూమ్ తీసుకున్నావా?” నొచ్చుకుంటూ అన్నాడు.

“నేను యిక్కడికి వస్తున్నట్లు శ్రీధర్‌కి తెలియదు,” జగపతిరావు ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేశాడు.

“శ్రీధర్ మీ స్వంత కొడుకు కాదు గదా!” నెమ్మదిగా అన్నాడు రాయప్ప.

తనముందు ఆటంబాంబు ప్రేలినట్లు త్రుళ్ళిపడ్డాడు జగపతిరావు. మనిషి షేక్ అయ్యాడు.

“ప్లీజ్! నిజం చెప్పండి,” ప్రాధేయపూర్వకంగా అడిగాడు రాయప్ప.

“ఎందుకు ఆ విషయం మీకు?”

“శ్రీధర్, కోటేశ్వరరావుగారి అమ్మాయిని ప్రేమించడం, పెళ్ళి చేసుకోవాలనుకోవడం మీకు తెలుసు గదా!”

అవునన్నట్లు తల వూపాడు జగపతిరావు.

“మొదట్లో పెళ్ళికి అంగీకరించి తర్వాత కాదంటున్నారు కోటేశ్వరరావు దంపతులు. కారణం యేమిటో తెలియక

శ్రీధర్ బాధపడుతున్నాడు. అదంతా తెలుసుకునే భారం నామీద పెట్టాడు. బహుశా మీకు గుర్తుండి వుంటుంది మిమ్మల్ని చూడగానే రుక్మిణీదేవి ఫిట్స్ వచ్చి పడిపోయింది. అదేవిధంగా మొదటిసారి శ్రీధర్‌ని చూసి గూడా! అలా జరగడంలో యేదో నిగూఢమైన రహస్యం వుందనిపిస్తోంది నాకు."

జగపతిరావు మౌనంగా ఆలోచిస్తున్నాడు.

"శ్రీధర్‌కి వాళ్ళమ్మాయిని ఇవ్వకపోవడానికి ఏదో కుంటిసాకు కారణంగా చూపుతున్నారు వాళ్ళు. కాని అసలు కారణం యేదో మీకు తెలిసి వుండాలి. బహుశా అది శ్రీధర్ మీ స్వంత కొడుకు కాదని తెలిసుకొన్నందు వల్లనేమో?"

"దాదాపు ఇరవై సంవత్సరాలు ఈ రహస్యం గుండెల్లో దాచుకొన్నాను. శ్రీధర్‌కి సైతం తెలియదు. నా బంధువులకిగూడా చెప్పలేదు. నిజమే శ్రీధర్ నా స్వంతకొడుకు కాదు. స్టిల్ ఐయామ్ యే బాచులర్," నవ్వాడు జగపతిరావు.

"శ్రీధర్ మీ స్వంతకొడుకు కాకపోతే మరుకు ఆమెకు అభ్యంతరం యెందుకో నాకు అర్థం కావడంలేదు," అన్నాడు రాయప్ప.

జగపతిరావు విల్స్‌ఫిల్టర్ సిగరెట్ తీసి వెలిగిస్తూ రాయప్పకి ఆఫర్ చేశాడు.

"నో థాంక్స్!" అన్నాడు రాయప్ప.

జగపతిరావు సిగిరెట్ పొగ నోట్లోంచి వూదుతూ సోఫాకి తల ఆనించి ఫ్రీగా కూర్చుని ఆలోచనలో పడిపోయాడు.

"అసలు శ్రీధర్, సులోచనల పెళ్ళికి మొదట్లో ఒప్పు

కొని, తర్వాత అడ్డం తిరగడం చాల ఆశ్చర్యంగా వుంది. నేనెంతో ఆలోచించినా యేమీ అర్థం కాలేదు. శ్రీధర్ మీ స్వంత కొడుకు కాదని, ఏ వూరివాడో, ఎవరి పాప ఫలితమో తెలియదనీ, అటువంటివాడికి పిల్లనివ్వడం తనకి ఇష్టం లేదనీ రుక్మిణీదేవి భర్తతో వాదించడం విని సులోచన మాకు చెప్పింది. అఫ్‌కోర్స్ శ్రీధర్‌కి తెలియనివ్వలేదనుకోండి,'' నవ్వాడు రాయప్ప.

"మొదటిసారి శ్రీధర్‌ని చూసి మూర్ఛపోవడానికి ఒక కారణం వుంది,'' అంటూ సోఫాలోంచి లేచి అటూ ఇటూ పచార్లు చేయసాగాడు జగపతిరావు.

రాయప్ప అతనిని విస్మయంగా చూశాడు.

"రుక్మిణీదేవి అన్న పార్థసారధి పోలికలు శ్రీధర్‌లో వున్నాయి. తొలిసారి అతన్ని చూసి తన అన్నకొడుకే అనుకొని నిర్ఘాంతపోయి ఆవేశంతో మూర్ఛపోయింది. తన అన్నకొడుకే అనుకొని సులోచనని ఇవ్వడానికి ఒప్పుకుంది. కాని తీరా పెళ్ళి నిశ్చయం చేసుకోవడానికి నేను, శ్రీధర్ వాళ్ళింటికి వెళ్ళాం. నన్ను చూసి మళ్ళీ మూర్ఛపోవడానికి కారణం నేను ఆమె అన్నగారిని కాకపోవడమే!'' అంటూ నవ్వాడు జగపతిరావు.

రాయప్ప ఆశ్చర్యంతో చూశాడు అదంతా నిజమేనా అన్నట్లు.

"నేను చెప్పేది నిజమే! తర్వాత ఆమె నన్ను ఏకాంతంగా కలుసుకొని శ్రీధర్ మీ స్వంత కొడుకు కాదు. నిజమేనా అంది. నాకు చాల ఆశ్చర్యం కలిగించింది. ఆమెకు యెలా తెలుసా అని. మొదట్లో బుకాయించాను నా స్వంత కొడుకే అని, నా భార్య చనిపోయిందనీ, మళ్ళీ పెళ్ళి యిష్టంలేక అలాగే వుండిపోయాననీ వాదిం

చాను.

ఆఖరికి ఆమె యెప్పటిదో ఒక పాత ఫోటో తీసి నాకు చూపించింది. ఆ ఫోటో చూసి నాకు చాల ఆశ్చర్యం కలిగింది. అందులో అచ్చు శ్రీధర్ లాగే వున్న యువకుడు వున్నాడు. ఆమె కథంతా చెప్పకొచ్చింది. ఆమె అన్న పార్ధసారథి గురించీ, శ్రీధర్ పార్ధసారధికి పుట్టిన అక్రమసంతానం అని రుజువు చేసినా నోరు మూయించింది.

అటువంటివాడికి తన కూతుర్ని ఇవ్వననీ, తన తండ్రి ఆత్మ క్షోభిస్తుందనీ, తన అన్న, తన కొడుకు గూడా ఇంటి పరువు ప్రతిష్టలు మంటగలిపారనీ వుపన్యాసం దంచింది. అయితే ఈ విషయం శ్రీధర్ కి తెలియనివ్వ వద్దని ఆమెను రిక్వెస్టుచేసి వచ్చేశాను." అన్నాడు జగ పతిరావు.

"అయితే శ్రీధర్ మీకు యెక్కడ దొరికాడు?"

"చెత్తకుప్పలో."

"నిజమా?"

"ఎస్."

"పార్ధసారథి కొడుకు చెత్తకుప్పలో యెలా దొరి కాడు?"

"చెప్తాను. అప్పుడు నేనొక ఎక్స్పోర్టు కంపెనీలో గుమస్తా పని చేస్తూ వుండేవాడిని. అప్పటికే జీవితంలో ఎన్నో ఆటుపోటులకు గురై నిరాశతో వున్నాను. నేను ప్రేమించి పెళ్ళి చేసుకోవాలనుకొన్న యువతి నమ్మించి మోసం చేసింది. డబ్బు, హోదా వున్న యువకుడిని పెళ్ళి చేసుకొని నన్నొక అసమర్ధుడి క్రింద జమకట్టింది. తర్వాత నేను డైమ్లిఫిష్ యెక్స్పోర్టు కంపెనీలో పని

చేస్తూనే చిల్లర వ్యాపారాలు చేస్తూ కొంత డబ్బు సంపాదించాను. ఇక వుద్యోగం మానేసి వ్యాపారంలో స్థిరపడాలని ఆలోచించసాగాను. ఆ సమయంలోనే శ్రీధర్ మా ఇంటిపక్క చెత్తకుప్పలో దొరికాడు. పిల్లవాడు ముద్దుగా వున్నాడు. ముచ్చటవేసి ఆ కుర్రాడిని తెచ్చుకుని పెంచుకున్నాను.

వాడి అదృష్టమే నేమో తర్వాత నేను మట్టి పట్టుకుంటే బంగారమైంది. ష్రింప్స్ యెక్స్పోర్టు బిజినెస్‌లో లక్షలు సంపాదించాను. మద్రాసులో హెడ్డాఫీసు వుంది నాకు, కాకినాడ, వైజాగ్‌లలో బ్రాంచీలు వున్నాయి."

అదంతా విని దీర్ఘంగా నిట్టూర్చాడు రాయప్ప.

"ఇంత సంపాదించారు గదా! పెళ్ళి యెందుకు చేసుకోలేదు మీరు?"

"అదేం ప్రశ్న? అంతా చెప్పాను గదా! ఈ ఆస్తికి శ్రీధర్ వారసుడు. వాడే స్వంత కొడుకనీ, నా భార్య చనిపోయిందనీ అందర్నీ నమ్మించాను. డబ్బుంది కాబట్టి, ఏ సుఖమైనా ఇంటికి నడిచి వస్తుంది. నో రిస్క్. అర్థమైందనుకుంటాను," నవ్వాడు జగపతిరావు.

తల వూపాడు ప్రైవేట్ డిటెక్టివ్ రాయప్ప.

"కాని శ్రీధర్ ఇంత తెలివితక్కువగా బిహేవ్ చేస్తాడని కలలో గూడా అనుకోలేదు. కో అంటే కోటి మంది వచ్చి క్యూలో నిల్చుంటారు పిల్లనిస్తామని. సులోచనకంటే అందగత్తెలని రోజుకోదాన్ని తెచ్చి అనుభవించగలిగే స్టేటస్ మాది. ఆఫ్టరాల్ ఒక ఆడదానికోసం అది లేకపోతే బ్రతకలేనని హీనస్థితికి దిగజారిపోవడం ఐ హేటిట్," కొంచెం కోపంగా అన్నాడు జగపతి

రావు.

"వాళ్ళిద్దరూ ప్రేమించుకున్నారు."

"నో.... దేర్ ఈజ్ నో లా ఇన్ దిస్ వరల్డ్," గట్టిగా అన్నాడు జగపతిరావు.

"ఏమో మీరు పెద్దవారు. అనుభవజ్ఞులు. మీకు చెప్ప వలసినవాడిని కాను. కాని ప్రేమ మానసిక బంధం అని నా అభిప్రాయం," అన్నాడు రాయప్ప.

"మీరు వాడికి స్నేహితులు. కాబట్టి కొంచెం బుద్ధి చెప్పండి. వాళ్ళు వద్దు మొర్రో అంటుంటే, వీడు వెంట బడడం యెంత చులకనగా వుంటుందో చూడండి."

రాయప్ప ప్రయత్నిస్తానని చెప్పి సెలవు తీసుకొని వచ్చేశాడు.

"ఏం జరిగింది?" ప్రశ్నించాడు నాగరాజు రాయప్ప రాగానే.

జరిగిందంతా చెప్పాడు రాయప్ప.

"శ్రీధర్‌కి ఈ సంగతి తెలిస్తే బాధపడతాడని మనం సీక్రెట్‌గా వుంచుతున్నాం. కాని యెన్నాళ్ళు? ఈసారి మనవాడు రుక్మిణీదేవి యెదుటపడితే మొఖంమీదే అనేసే ట్లుగా వుంది. పైగా ఆవిడకి ఫిట్స్ రోగం ఒకటి. యేదైనా గట్టిగా మాట్లాడ్డానికి భయంగా వుంది."

"మరి కర్తవ్యం. చేతులెత్తి వూరుకోవడమేనా?"

"ఒకటే మార్గం వుంది."

"ఏమిటి?"

"బ్రహ్మాస్త్రంలాగా ఆఖరి అస్త్రం. ఢిల్లీ వెళ్ళి ఆవిడ అన్న పారసారథిని లాక్కొని రావడం. అన్నా చెల్లెళ్ళకి సంధి చేసి పెళ్ళికి వప్పించడం" అన్నాడు రాయప్ప.

6

"కొంప మునిగిందిరా బాబూ!" అంటూ హడా వుడిగా వచ్చాడు శ్రీధర్.

"ఏం జరిగింది" అన్నాడు నాగరాజు.

"పైకి రా చెప్తాను." అంటూ అప్‌స్టెయిర్‌కి వెళ్ళిపోయాడు.

"ఏమిటి హడావుడి? మళ్ళీ యెవడైనా తన్నడానికి వచ్చాడా?"

"తన్నడానికి వస్తే చావగొట్టి చెవులు మూయించి పంపిద్దును. కాని అంతా మోసం!" అన్నాడు శ్రీధర్.

బ్రౌన్ కవరు టీపాయ్‌మీదకు విసిరేసి "చూడు" అన్నాడు.

నాగరాజు కవరు తెరచి చూశాడు. ఫుల్ సైజు ఫోటో అందులో శ్రీధర్ పడుకొనివుంటే, ఎవరో యువతి అర్ధ నగ్నంగా అతనిమీద చేతులువేసి నిద్రపోతూ వుంది.

కరెంట్ షాక్ తగిలినట్లు అదిరిపడ్డాడు నాగరాజు.

"ఏమిట్రా ఇది?"

"మోసం," అన్నాడు శ్రీధర్ కోపంతో.

"ఎవరు ఇచ్చారు నీకు?"

"సులోచన."

"మైగాడ్. ఆవిడకు ఎక్కడిది?"

"వాళ్ళమ్మ ఇచ్చిందట. నువ్వు ప్రేమించే శ్రీధర్ యెంత నీతిమంతుడో చూడు అని ఇచ్చిందట. సులోచన నా రూమ్‌కి వచ్చి అది నా మొఖాన కొట్టి రుస రుస లాడుతూ మాటా పలుకూ లేకుండా వెళ్ళిపోయింది," అన్నాడు శ్రీధర్ నీరసంగా.

"ఈ ఫోటో యెవరు తీశారు? యెలా తీశారు? ఇదేదో ట్రిక్ ఫోటో కాదు గదా?"

"ట్రిక్ కాదు నా మొఖం కాదు. జరిగింది చెప్తాను విను," అంటూ సిగరెట్ వెలిగించి చెప్పసాగాడు శ్రీధర్.

"ఒకరోజు నేను సెకండ్ షో సినిమాకెళ్ళి వస్తున్నా. పార్కు దగ్గరికి వచ్చేసరికి యెవరో స్త్రీ కేకలు పెడుతున్నట్లు అనిపించి బైక్ ఆపేశాను. దూరంగా చెట్టు క్రింద యెవరో ఆడమనిషి యెవరితోనో పెనుగులాడుతున్నట్లు మసకగా కనిపించింది. మనకెందుకులే పోదాం అనుకున్నాను. కాని వెళ్ళలేకపోయాను. పార్కు గేట్లు తాళాలు వేసివున్నాయి. మోటార్ సైకిల్ లాక్ చేసి గోడ దూకి పరిగెత్తుకెళ్ళాను.

నన్ను చూసి అతను మీదకు దూకాడు. నాలుగు తంతే పారిపోయాడు.

ఆమె వెక్కి వెక్కి ఏడుస్తున్నది.

ఎవరో పాపం!

ఏం జరిగిందో చెప్పమన్నాను.

ఆమె పేరు పార్వతి. తాడికొండ గ్రామం వాళ్ళది. వాళ్ళ నాన్నకి నలుగురు ఆడపిల్లలు. పెద్దమ్మాయి పార్వతి. వయసు పాతికేళ్ళు. చెల్లెళ్ళంతా పెద్దమనుషులయ్యారు. ఆఖరివాడు తమ్ముడు. క్యాన్సర్ వచ్చి తల్లి చనిపోయి సంవత్సరం దాటింది.

తండ్రి అతి కష్టంమీద సంసారం ఈడుస్తున్నాడు. అతనికి రెండెకరాల పొలం వుంది. కౌలుకు మరికొంత తీసుకొని వ్యవసాయం చేస్తున్నా ప్రతి యేడూ తుఫాన్లు రావడంవల్ల తిండికే చాలడంలేదు రాబడి.

ఇక తనకి తండ్రి పెళ్ళి చెయ్యలేడని నిర్ణయించు కుంది పార్వతి. ఇంటిప్రక్క ఆమె తమ్ముడు ఇక్కడ ఏదో ఫ్యాక్టరీలో పని చేస్తూ అప్పుడప్పుడూ అక్కగారింటికి వచ్చేవాడు.

అతను పెళ్ళి చేసుకుంటానని నమ్మించి పార్వతిని తీసు కొచ్చాడు కాని మోసం చేశాడు. వెయ్యి రూపాయలకు ఎవరికో అమ్మేడు. నెలనుంచి నరకయాతన అనుభవిస్తు న్నది పార్వతి.

చివరికి ఈ రోజు యెవరో వంద రూపాయలు ఇచ్చి రూమ్‌కి తెచ్చుకొన్నారు. అందులో నలుగురు మనుషు లున్నారు. అంతా సీసాలు ముందు పెట్టుకుని త్రాగు తున్నారు. ఆమెకు భయంవేసి పారిపోయివచ్చిపార్కులో దాక్కుంది. అందులో ఒకడు కనిపెట్టి పట్టుకున్నాడు.

అదీ పార్వతి చెప్పిన కథ.

"చివరికి యేదైనా దారి చూపించి పుణ్యం కట్టుకో మని యేడ్చింది."

అదంతా నిజమేనని అమాయకంగా నమ్మాను.

అంత రాత్రిలో యేం చెయ్యగలను.

తెల్లవారిన తర్వాత ఆలోచిద్దామని ఆమెను మోటార్ సైకిల్‌మీద యెక్కించుకొని రూమ్‌కి తీసుకెళ్ళాను.

చాప ఇచ్చి క్రింద పడుకోమని చెప్పాను. నేను నా బెడ్ రూమ్‌లో పడుకొని నిద్రపోయాను. సెకండ్ షోకి వెళ్ళిరావడం వలన వెంటనే నిద్ర పట్టింది.

నేను నిద్రపోతున్నప్పుడు యెవరో వచ్చి ఫోటో తీసి వుండాలి.

తెల్లవారి నేను నిద్ర లేచేసరికి ఆమె లేదు." అన్నాడు శ్రీధర్ ముగిస్తూ.

"భలే గమ్మత్తుగా వుందిరా కథ. రియల్లీ ఐ వండర్. నిజమేనా అని అనుమానంగా వుంది," నవ్వుతూ అన్నాడు నాగరాజు.

"నన్ను అనుమానిస్తున్నావా?"

"ఏం యెందుకు కూడదు? అర్ధరాత్రి ఒంటరిగా ఆడపిల్ల రూమ్‌లో వుంటే నిగ్రహించుకుని వుండడం! అబ్బ యెంత కష్టమో! ఏ ఋష్యశృంగుడో, ప్రవరాఖ్యుడో అయితే తప్ప నాలాటి వాడికి అసాధ్యం. నిజం చెప్పు. ఫరవాలేదు సులోచనకు చెప్పనులే," అన్నాడు నాగరాజు నవ్వుతూ.

"నిజం చెప్తుంటే నమ్మవేం? జోక్‌గా వుందా?"

"ఏమో నాకైతే నమ్మకం కలగడంలేదు."

"అంతా నా కర్మ. ఇదంతా వాళ్ళమ్మ చేయించిందని నా నమ్మకం."

"మే బీ." అన్నాడు నాగరాజు.

"నామీద అంత పగ ఎందుకో అర్ధం కావడంలేదు," సిగిరెట్ పొగ పైకి వదుల్తూ అన్నాడు శ్రీధర్.

"ఎందుకేమిటి? నువ్వు వాళ్ళమ్మాయిని యెత్తుకెళ్ళి దొంగపెళ్ళి చేసుకుంటావేమోనని భయం."

"అలా చేసేవాడ్నైతే యెప్పుడో చేసుకునేవాడిని. అంత కర్మ ఏంపట్టింది. దర్జాగా దొరలా చేసుకుంటాను."

"అందుకే కూతురు మనసు విరిచెయ్యడానికి ఆ ఫోటో కథ సృష్టించింది. భేష్ మీ అత్తగారు సారీ కాబోయే అత్తగారు గొప్ప తెలివితేటలు కలదిరా నాయనా! పోయిన జన్మలో ఏ డిటెక్టివో గాని," అంటూ నవ్వాడు నాగరాజు.

"ఇప్పుడు ఆ ఫోటో కథ నిజం కాదని సులోచనని

యెలా ఒప్పించాలో అర్థం కావడం లేదు," దిగులుగా అన్నాడు శ్రీధర్.

"రాయ్‌ని రానీ యేదైనా వుపాయం చెప్పకపోడు." అన్నాడు నాగరాజు.

"అన్నట్లు రాయ్ యెక్కడ?"

"ఏదో పనుందని హైదరాబాద్ వెళ్లాడు" అన్నాడు నాగరాజు. అతను ఢిల్లీ వెళ్ళిన సంగతి దాచిపెడుతూ.

"సరే, రాగానే నాకు ఫోన్ చెయ్యి," అన్నాడు శ్రీధర్.

7

"ఆ ఫోటో సంగతి చెప్పాడా మనవాడు," అంటూ వచ్చాడు శ్రీధర్.

"ఆఁ" అన్నాడు రాయప్ప తల వూపుతూ.

"సులోచనకి నచ్చచెప్పడం యెలాగో తల బద్దలై పోతోంది. నన్నింత చీప్‌గా అంచనా వేస్తుందని కలలో గూడ అనుకోలేదు," బాధగా అన్నాడు శ్రీధర్.

రాయప్ప మౌనంగా కూర్చున్నాడు.

"ఇప్పుడేం చెయ్యాలి చెప్పు. అసలు సమస్య అలాగే వుంది. కొత్త కొత్త సమస్యలు వచ్చి పడుతున్నాయ్!" చిరాకుగా అన్నాడు శ్రీధర్.

రాయప్ప నవ్వాడు.

"నవ్వుతావేమిటి? ఇల్లు కాలి నే నేడుస్తుంటే!"

"నవ్వక ఏడవమంటావా?"

"బాగుంది. ఏదోక సలహా చెప్పు. సులోచనని రమ్మని ఫోన్ చెయ్యి. నువ్వు రమ్మంటే వస్తుందేమోనని ఆశ" అన్నాడు శ్రీధర్.

"నీకొక సంగతి చెప్పాలి. ముందు డోర్ బోల్టు

వేసిరా!"

"ఎందుకూ?" ఆశ్చర్యంగా అన్నాడు శ్రీధర్.

"సీక్రెట్ కాబట్టి."

"ఏమిటది? ఇక్కడెవరున్నారు? చెప్పు."

"ముందు వేసిరా చెప్తాను."

శ్రీధర్ విసుగ్గా లేచి బోల్టు వేసి వచ్చి కూర్చున్నాడు.

"శ్రీధర్ నువ్వు సులోచనని మర్చిపో" గంభీరంగా అన్నాడు రాయప్ప.

"ఇదా నువ్వు చెప్పే సీక్రెట్?" అసహనంగా అన్నాడు శ్రీధర్.

"తొందరపడకు. సావధానంగా ఆలోచించు. ప్లీజ్!"

"నువ్వీ సలహా చెప్పనవసరం లేదు" రోషంగా అన్నాడు.

"ఎందుకు చెప్తున్నానో ఆలోచించవేం?" మందలింపుగా అన్నాడు రాయప్ప.

"ఎందుకో చెప్పరాదూ! ఇంకా నేను ఆలోచించడం ఎందుకు టైం వేస్ట్!"

"సులోచనని నువ్వు పెళ్ళి చేసుకుంటే రుక్మిణీదేవి చచ్చిపోతుంది."

"పొరబడుతున్నావ్ రాయ్! కొన్నాళ్ళు బాధపడినా తర్వాత సర్దుకుపోతుంది."

"నో శ్రీధర్."

"నువ్వెలా చెప్పగలవు?"

రాయప్ప పేలవంగా నవ్వాడు.

"శ్రీధర్. రుక్మిణీదేవి నీ కన్నతల్లి."

"నో...." గట్టిగా కేక పెట్టాడు శ్రీధర్.

"ప్లీజ్. డోంట్ అప్ సెట్ శ్రీధర్. దిస్ ఈజ్ ఫాక్ట్" అంటూ చెప్పసాగాడు.

"రుక్మిణీదేవిని ఒప్పించడానికి ఆమె అన్న పార్థసారథిని తీసుకుని రాపడానికి ఢిల్లీ వెళ్ళాను. అతను చెప్పిన వివరాలు ఇవి. మెడ్రాస్‌లో చదువుకునే రోజుల్లో జరిగింది ఈ కథ. అన్నా చెల్లెలు ఒక రూమ్‌లో వుండి వంట మనిషితో వంట చేయించుకుని కాలేజీకి వెళ్తూ వుండే వాళ్ళు.

వాళ్ళు అద్దెకుంటున్న ఇంటి యజమాని కొడుకుతో ప్రేమలో పడింది రుక్మిణీదేవి. వ్యవహారం చాలాదూరం పోయాక తెలిసింది, అతనికి పెళ్ళయిందనీ, కట్నందగ్గర పేచీ వచ్చి ఆమె పుట్టింట్లో వుందనీ.

డాక్టర్‌కి చూపిస్తే అబార్షన్ చేయిస్తే అసలు తల్లి ప్రాణానికే ప్రమాదం అని చెప్పింది. ఇక గత్యంతరంలేక ఆత్మహత్య చేసుకోబోయిన చెల్లెలిని రక్షించి, అనునయించి రహస్యంగా పురుడు పోయించారు. పుట్టిన బిడ్డని చెత్త కుండీలో పారవేశారు. ఆ బిడ్డవే నువ్వు!

నీకు మేనమామ పోలికలు వచ్చాయి. పార్థసారథి అచ్చు నీలాగే వుంటాడు. రుక్మిణీదేవి నీవు తన కొడుకువని తెలుసుకుంది. అందుకే మీ పెళ్ళికి సమ్మతించలేదు.

కాబట్టి, సులోచన నీ చెల్లెలు. ఆమె మనసులోవున్న అపోహను అలా వుండనీ. ఆమెను నీ స్వంత చెల్లెలుగానే భావించు...."

రాయ్ చెప్తున్నదంతా వింటూ శిలావిగ్రహంలా కూర్చుండిపోయాడు శ్రీధర్.

—: ఐపోయింది :—